ప్రభాత
తెలుగు దినపత్రిక
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
jayabherinews
JAYABHERIDAILY.COM
17-08-2024
శనివారం
మల్కాజిగిరి
సంపుటి : 01 | సంచిక : 343 | పేజీలు : 8 | వెల : 4
JB జయభేరి



## త్వరలోనే హైదరాబాద్‌ను
# సందర్శిస్తా

**ఇండస్ట్రీ, సర్వీస్ రంగాల్లో విస్తరించే సత్తా గల నగరం... ఫోర్త్ సిటీ ఏర్పాటులో మీ విజన్ అద్భుతం.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఫాక్స్‌కాన్ ఛైర్మన్ యంగ్ లియూ హైదరాబాద్‌లో పెట్టుబడులకు సానుకూలత**

**జయభేరి, ఢిల్లీ:**

ఇండస్ట్రీ, సర్వీస్ సెక్టార్లతో పాటు అన్ని రంగాల్లో విస్తరించే సత్తా హైదరాబాద్ నగరానికి ఉందని అంతర్జాతీయ దిగ్గజ పారిశ్రామిక సంస్థ ఫాక్స్ కాన్ ఛైర్మన్ యాంగ్ లియూ అన్నారు. త్వరలోనే తన బృందంతో కలిసి హైదరాబాద్ నగరాన్ని సందర్శిస్తానని ఆయన తెలిపారు. ఫాక్స్ కాన్ ఛైర్మన్ యాంగ్ లియూ నేతృత్వంలోని ఫాక్స్ కాన్ ప్రతినిధి బృందం ఢిల్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఆయన అధికారిక నివాసంలో శుక్రవారం ఉదయం సమావేశమైంది. హైదరాబాద్ నగరానికి ఉన్న చరిత్ర.. పారిశ్రామిక సంస్థల విస్తరణకు ఉన్న అనుకూలత, అద్భుతమైన వాతావరణ పరిస్థితులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫాక్స్ కాన్ బృందానికి వివరించారు. 430 ఏళ్ల కింద పునాది రాయి పడిన హైదరాబాద్ కాలక్రమంలో

...మిగతాది 2 లో

# ఎమ్మెల్సీలుగా ప్రొ కోదండరాం ఆమీర్ అలీఖాన్ ప్రమాణం



**జయభేరి, హైదరాబాద్, ఆగస్టు 16:**

గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా ప్రొఫెసర్ కోదండరామ్, జర్నలిస్ట్ అమీర్ అలీఖాన్ ప్రమాణ స్వీకారం చేశారు. మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. వీరి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్సీ మహేశ్ గౌడ్, ప్రభుత్వం సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. ప్రమాణ స్వీకారం అనంతరం ప్రొఫెసర్ కోదండరామ్ సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం మీడియాతో కాసేపు ఇష్టాగోష్ఠిగా ముచ్చటించారు. తాను ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేయడం పట్ల ఉద్యమకారులు సంతోషంగా ఉన్నారని ఆయన తెలిపారు.

ఉద్యమకారుల ఆత్మబలిదానాలతో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని తెలిపారు. వారి ఆకాంక్షలకు అనుగుణంగా తాను పనిచేస్తానని కోదండరామ్ తెలిపారు. తెలంగాణ రావడం వలనే తనలాంటి ఉద్యమకారులకు గుర్తింపు లభించిందని ఆయన అన్నారు. దీన్ని పదవిలా కాకుండా బాధ్యతగా భావించి పనిచేస్తానని చెప్పారు.

**సుప్రీంకోర్టు తీర్పుతో మార్గం సుగమం...**

గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2023 జులైలో దాసోజు శ్రవణ్‌కుమార్, కుర్రా సత్యనారాయణలను గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా నియమించాలంటూ చేసిన సిఫార్సులను అప్పటి గవర్నర్ తమిళిసై రద్దు చేయడం జరిగింది. దీంతో ఆ స్థానాల్లో

...మిగతాది 2 లో



## ద్రవిడ పార్టీల బాటలో
# గులాబీ పార్టీ

**జయభేరి, హైదరాబాద్, ఆగస్టు 16 :**

కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు.. చూడడానికి బక్క పల్చని మనిషి. కానీ, తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం పార్టీని స్థాపించి.. శాంతియుద నిరసనలు, సంప్రదింపులు, లాబీయింగ్ ద్వారా స్వరాష్ట్రం సాధించి బక్కోన్ని కాదు బలవంతుడిని అని నిరూపించారు. ఇక స్వరాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా కూడా ఆయనే అయ్యారు. వరుసగా రెండు పర్యాయాలు పార్టీని గెలిపించి దాదాపు తొమ్మిదిన్నరేళ్లు తెలంగాణను పాలించారు. కొత్త రాష్ట్రమే అయినా తెలంగాణను అన్ని రంగాల్లో పెద్ద రాష్ట్రాలకు దీటుగా అభివద్ధి చేశారు. తాగు, సాగునీటి సమస్య పరిష్కరించారు. కొరెంటు కోతలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దారు. ఇందతా ఒక్క రాత్రే జరగలేదు. దీని

...మిగతాది 2 లో



## మహిళలకు
# కేటీఆర్ సారీ

**జయభేరి, హైదరాబాద్, ఆగస్టు 16:**

మహిళలకు ఫ్రీ బస్సు పథకంపై.. కస్సుబుస్సు అంటున్నాయి అధికార విపక్షాలు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన కామెంట్లకు అంతకంటే ఘాటుగా కౌంటర్ ఇచ్చారు మంత్రి సీతక్క. ఇక కేటీఆర్ వ్యాఖ్యలపై విచారణకు ఆదేశించింది మహిళా కమిషన్. ఈ నేపథ్యంలోనే ఒక అడుగు వెనక్కి వేసిన కేటీఆర్, మహిళలకు క్షమాపణలు చెప్పారు. పంద్రాగస్ట్ సందర్భంగా పార్టీ సమావేశంలో చేసిన వ్యాఖ్యలవల్ల, మహిళలకు మనస్తాపం కలిగితే విచారం వ్యక్తం చేస్తున్నా అంటూ కేటీఆర్ పేర్కొన్నారు. అక్కచెల్లెమ్మలకు కించపరిచే ఉద్దేశం ఎప్పుడూ లేదని, వారిని మనస్సు నొచ్చుకుంటే సారీ అంటూ కేటీఆర్ సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. "గురువారం పార్టీ సమావేశంలో యథాలాపంగా చేసిన వ్యాఖ్యల వల్ల మా మహిళా సోదరీమణులకు మనస్తాపం కలిగితే, నేను విచారం వ్యక్తం చేస్తున్నాను. నా అక్కచెల్లెమ్మలను కించపరిచే ఉద్దేశం ఎప్పుడూ లేదు" అని కేటీఆర్ ఎక్స్‌లో ట్వీట్ ద్వారా క్లారిటీ ఇచ్చారు.నిన్న పార్టీ సమావేశంలో యథాలాపంగా చేసిన వ్యాఖ్యల వల్ల మా మహిళా సోదరీమణులకు మనస్తాపం కలిగితే, నేను విచారం వ్యక్తం చేస్తున్నాను అయితే అంతకుముందు మహిళలకు ఉచిత బస్సు పథకంపై తెలంగాణలో మాటల యుద్ధం నడుస్తోంది. ఉచిత బస్సు ప్రయాణంపై అధికార కాంగ్రెస్, విపక్ష బీఆర్ఎస్‌ల మధ్య రగడ రాజుకుంది. మహిళలు బస్సుల్లో ప్రయాణించేటప్పుడు, వాళ్ల పని వాళ్లు చేసుకుంటే తప్పేంటి అంటూ అసెంబ్లీలో మంత్రి సీతక్క చేసిన కామెంట్లపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కౌంటర్ ఇచ్చారు. బస్సులో అల్లం వెల్లుల్లి ఏరితే తప్పని తాము అనలేదంటూ కేటీఆర్ సెటైర్లు వేశారు. మనిషికో బస్సు పెట్టండి, బ్రేక్ డ్యాన్సులు చేసుకోండంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.మహిళలను బ్రేక్ డ్యాన్సులు చేసుకోమంటారా అంటూ కేటీఆర్‌పై మంత్రి సీతక్క మండిపడ్డారు. లాంగ్ జర్నీలో ఖాళీగా ఉండలేక, పనులు చేసుకుంటే తప్పేంటి అని ప్రశ్నించారు సీతక్క. మీ ఇళ్లల్లో ఆడపడుచులు లేరా అంటూ కేటీఆర్‌పై మంత్రి ఫైర్ అయ్యారు. బైట్ : సీతక్క, తెలంగాణ మంత్రి. మాటల మంటలు రేపిన ఈ డైలాగ్ వార్‌పై సీరియస్ అయిన మహిళా కమిషన్.. KTR వ్యాఖ్యలను సుమోటోగా స్వీకరించి, విచారణకు ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలోనే కేటీఆర్ మహిళలకు క్షమాపణలు చెప్పారు.

# పొంచి ఉన్న మంకీ పాక్స్ ప్రమాదం



**జయభేరి, హైదరాబాద్, ఆగస్టు 16:**

కోవిడ్ సృష్టించిన బీభత్సం నుంచి ఇప్పుడిప్పుడే తేరుకుంటున్న ప్రపంచానికి మంకీపాక్స్ కొత్త సవాల్ విసురుతోంది. ఆఫ్రికా దేశాల్లో హఠాత్తుగా కేసులు పెరిగిపోవడం, అది మిగిలిన దేశాలకు వేగంగా వ్యాపిస్తుండటంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించింది. ఈ తరహా ఎమర్జెన్సీ ప్రకటించడం రెండేళ్లలో ఇది రెండోసారి.పాత వ్యాధి కొత్త రూపు సంతరించుకొని ప్రపంచాన్ని భయపెడుతోంది. ఎంపాక్స్‌గా పిలిచే మంకీ పాక్స్ ఆఫ్రికా దేశాలను వణికిస్తోంది. అక్కడ దశాబ్దాలుగా ఈ వ్యాధి ఉంది. కాంగో దేశంలో ఇది చాలా తీవ్రంగా ఉంది. 1970లో తొలిసారి ఈ వ్యాధి ఆ దేశంలో

...మిగతాది 2 లో

## ఉపరాష్ట్రపతికి
# ఘన స్వాగతం



**జయభేరి, హైదరాబాద్, ఆగస్టు 16 :**

రాష్ట్రంలో స్వల్పకాల పర్యటనకు గాను వచ్చిన ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్, డాక్టర్ సుదేష్ ధన్కర్ లకు శంషాబాద్ విమానాశ్రయం లో ఘన స్వాగతం లభించింది. ఉపరాష్ట్రపతి దంపతులకు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాల్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, డీజీపీ జితేందర్ లు ఘన స్వాగతం పలికారు. అనంతరం, ఉపరాష్ట్రపతి కన్హా శాంతి వనంలో ఏర్పాటు చేసిన ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనడానికి వెళ్లారు.

...మిగతాది 2 లో



# హరీశ్ రాజీనామా చేస్తారా

**జయభేరి, హైదరాబాద్, ఆగస్టు 16:**

ఆగస్టు 15లోపు రైతులకు రుణమాఫీ చేయగలిగితే రాజీనామా చేస్తానని సవాలు విసిరిన మాజీ మంత్రి హరీశ్ రావు అన్న మాట నిలబెట్టుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. రుణమాఫీ చేయడం కుదరదని.. కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పని చేస్తే సిద్దిపేట ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని గతంలో హరీశ్ రావు సవాల్ విసిరిన సందర్భాన్ని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. ఇప్పుడు హరీశ్‌రావు రాజీనామా చేయాలని.. లేకుంటే తెలంగాణ రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేదా హైదరాబాద్ లోని అమర వీరుల స్తూపం వద్ద ముక్కు నేలకు రాయాలని అన్నారు. అదీ కుదరకపోతే తాను విసిరిన ఛాలెంజ్‌ను వెనక్కు తీసుకుంటున్నట్టు హరీశ్ రావు చెప్పాలని డిమాండ్ చేశారు.సాగుకు జీవం..రైతుకు ఊతం పేరుతో ఖమ్మం జిల్లా వైరాలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ హరీశ్ రావు గురించి ప్రస్తావించారు. దేశచరిత్రలోనే తొలిసారి రైతులకు ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేసిన ఘనత తెలంగాణ ప్రజా ప్రభుత్వానికే దక్కిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. రూ.2 లక్షల రుణమాఫీ కోసం మొత్తం రూ.31వేల కోట్లు వెచ్చిస్తున్నామని, తద్వారా వరంగల్ డిక్లరేషన్ లో ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నామని చెప్పారు. ప్రజాప్రభుత్వం అజెండాలో వ్యవసాయరంగానికి ప్రాధాన్యత ఉందని, ఒకవైపు రైతు సంక్షేమ కార్యక్రమాలు అమలుచేస్తూ, మరోవైపు రాష్ట్రంలోని పెండింగ్ ప్రాజెక్టులను కూడా శరవేగంగా నిర్మిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. ''ఖమ్మం జిల్లాలో సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టును ఈరోజే జాతికి అంకితం చేసుకున్నాం. ఏడాది తిరిగేలోపే ఆ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తుంది" అని ముఖ్యమంత్రి తెలిపారు. అటు ప్రాజెక్టుల నిర్మాణం, ఇటు రుణమాఫీ ప్రక్రియతో తెలంగాణ రైతన్నల ఇంట పండుగ వాతావరణం నెలకొందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. రుణమాఫీ ప్రక్రియలో సాంకేతిక కారణాలతో రైతులకు ఏవైనా

...మిగతాది 2 లో

▸▸ మొదటిపేజీ తరువాయి

## ఎమ్మెల్సీలుగా ప్రొ కోదండరాం ఆమీర్ అలీఖాన్ ప్రమాణం

ఆ తర్వాత ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రొఫెసర్ కోదండరాం, అమీర్ అలీఖాన్‌లను నియమించడాన్ని హైకోర్టు కొట్టివేసింది. దీనిపై సుప్రీంకోర్టు బుధవారం స్టే ఇచ్చింది. కొత్తవారి నియామకాన్ని నిలిపివేయాలన్న పిటిషనర్ విజ్ఞప్తిని తోసిపుచ్చింది. నియామకాలలో కలగజేసుకోలేమని తేల్చిచెప్పింది. దీంతో వీరి ప్రమాణస్వీకారానికి మార్గం సుగమం అయింది.
కోదండరాం సార్‌గా సుపరిచితుడైన ముద్దసాని కోదండరాం 1955 సెప్టెంబర్ 5న ముద్దసాని వెంకటమ్మ, ఎం.జనార్దన్ రెడ్డి దంపతులకు జన్మించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నెన్నెల మండలం జోగాపూర్ ఆయన స్వగ్రామం. హన్మకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో డిగ్రీ, ఓయూలో పొలిటికల్ సైన్స్ విభాగంలో పీజీ, జేఎన్‌యూలో ఎంఫిల్ పూర్తి చేశారు. 1981లో ఉస్మానియా విశ్వ విద్యాలయంలో ఉద్యోగం రావడంతో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో పీహెచ్డీ మధ్యలో ఆపేశారు. ఓయూలో సుదీర్ఘ కాలం ప్రొఫెసర్‌గా పనిచేసిన కోదండరాం.. దివంగత ప్రొఫెసర్ జయశంకర్, ప్రొఫెసర్ కేశవరావు జాదవ్ సహా అనేక మంది ప్రముఖ తెలంగాణవాదులతోనూ కలిసి పనిచేశారు. ఆదివాసీల హక్కులపై దివంగత నేత బాలగోపాల్, ప్రొఫెసర్ బియ్యాల జనార్దన్‌రావులతో కలిసి ఆయన పని చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో రాజకీయ జేఏసీ చైర్మన్‌గా అన్ని పార్టీలను ఏకం చేయడంలో కీలకపాత్ర పోషించారు. క్రియాశీలంగా పని చేశారు.

**జర్నలిజంలో విశేష కృషి చేసిన ఆమీర్ అలీఖాన్**
జర్నలిజంలో విశేష సేవలందించిన ఆమీర్ అలీఖాన్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి బీసీఏ, తరువాత సుల్తాన్-ఉల్-ఉలూమ్ కాలేజీ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ నుంచి ఎంబీఏ చేశారు. ఆయన సియాసత్ ఉర్దూ దినపత్రిక రెసిడెంట్ ఎడిటర్ జాహెద్ అలీఖాన్ కుమారుడు.
ప్రస్తుతం సియాసత్‌లో న్యూస్ ఎడిటర్‌గా కొనసాగుతున్నారు. హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న సియాసత్ పత్రిక ఖతర్ దేశానికి కూడా విస్తరించింది. పలు అంతర్జాతీయ ఈవెంట్లను కవర్ చేయడానికి ప్రధానమంత్రి, రాష్ట్రపతిల వెంట విదేశీ పర్యటనలకు వెళ్లారు. 1973 అక్టోబర్ 18న హైదరాబాద్‌లో జన్మించిన ఆమీర్ అలీ ఖాన్ హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ప్రాథమిక విద్యను అభ్యసించారు. ఆయనకు ఉర్దూతో పాటు ఇంగ్లీష్, హిందీ, అరబిక్, తెలుగు భాషలు తెలుసు.

## త్వరలోనే హైదరాబాద్‌ను సందర్శిస్తా

మూడు నగరాలుగా అభివృద్ధి చెందిన తీరును ముఖ్యమంత్రి తెలియజేశారు. ప్రభుత్వాలు మారినా పారిశ్రామిక అభివృద్ధిలో వైరుధ్యాలు లేకపోవడంతోనే హైదరాబాద్ వేగంగా పురోగతి చెందుతోందన్నారు.. ఆ అభివృద్ధిని మరింతగా పరుగులు పెట్టించేందుకే తాము ప్రస్తుత ప్రపంచ అవసరాలకు తగినట్లు ఫ్యూచర్ సిటీ పేరుతో నాలుగో నగరానికి (ఫోర్త్ సిటీ) రూపకల్పన చేస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. ఫోర్త్ సిటీలో విద్యా, వైద్యం, క్రీడా, ఎలక్ట్రానిక్స్ఎలక్ట్రికల్, స్కిల్ డెవలప్‌మెంట్ ఇలా బహుముఖంగా అభివృద్ధి చేయనున్నామని చెప్పారు. ప్రస్తుత ప్రపంచానికి అవసరమైన స్కిల్స్‌ను యువతకు అందించేందుకు యంగ్ ఇండియా స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీని ప్రారంభిస్తున్నామన్నారు. నవ తరం పరిశ్రమల అవసరాలు, వాటికి అవసరమైన నైపుణ్యాలు, భవిష్యత్తులో ఆయా పరిశ్రమల అవసరాలు తీర్చే మానవ వనరులను అందించేందుకు అవసరమైన సిలబస్ రూపకల్పనలో ప్రముఖ పారిశ్రామికవేత్తలను భాగస్వాములను చేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే స్కిల్ యూనివర్సిటీకి ఆనంద్ మహేంద్రను ఛైర్మన్‌గా, మరో పారిశ్రామిక వేత్త శ్రీనివాస రాజును వైస్ ఛైర్మన్‌గా నియమించామని తెలిపారు. అంతర్జాతీయ విమానాశ్రయం, ఔటర్ రింగు రోడ్డు (ఓఆర్ఆర్), రీజినల్ రింగురోడ్డు (ఆర్ఆర్ఆర్)తో పాటు హైదరాబాద్‌కు ఉన్న అన్ని అనుకూలతలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వారికి వివరించారు.
ఫోర్త్ సిటీలో ఫాక్స్ కాన్ సంస్థ పరిశ్రమలు పెట్టేందుకు అవసరమైన అన్ని అనుమతులు ఇవ్వడంతో పాటు అవసరమైన మద్దతు అందజేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫాక్స్ కాన్ ఛైర్మన్ యాంగ్ లియూకి హామీ ఇచ్చారు. ఫోర్త్ సిటీలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. పారిశ్రామిక అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, అందిస్తున్న ప్రోత్సాహకాలు, ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో తమ బృందం అమెరికా, దక్షిణ కొరియాలో పర్యటించి దిగ్గజ పారిశ్రామిక సంస్థలతో జరిపిన చర్చలు, చేసుకున్న ఒప్పందాలను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ఛైర్మన్ యాంగ్ లియూకి వివరించారు.
ఫోర్త్ సిటీ రూపకల్పనలో ముఖ్యమంత్రి దార్శనికత, పారిశ్రామిక అనుకూల విధానాలు తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని ఫాక్స్ కాన్ ఛైర్మన్ యాంగ్ లియూ అన్నారు. ఫోర్త్ సిటీతో పాటు పారిశ్రామిక అనుకూల విధానాల్లో మీ విజన్ అద్భుతంగా ఉందంటూ యాంగ్ లియూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అభినందించారు. తాను సాధ్యమైనంత త్వరలోనే హైదరాబాద్ ను సందర్శిస్తానని తెలిపారు.

## ద్రవిడ పార్టీల బాటలో గులాబీ పార్టీ

వెనుక కేసీఆర్ కషి, పట్టుదల, వ్యూహరచన, ప్రణాళిక ఉన్నాయి. కేసీఆర్ వ్యూహాలు ఎవరికీ అంత సులువుగా అర్థం కావు. అందుకే తెలంగాణ రాష్ట్ర సాధన, రెండుసార్లు అధికారంలోకి రావడం వెనుక ఆయన వ్యూహాలే కారణం. అయితే 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్ వ్యూహాలు ఫలించలేదు. అహంకార పూరిత మాటలు, కుటుంబ పాలన, ఉద్యోగాల భర్తీలో వివక్ష, తాను ఏం చేసినా చెల్లుతుందన్న ధోరణి బీఆర్ఎస్ ఓటమికి కారణమయ్యాయి. ప్రస్తుతం ప్రతిపక్షానికి పరిమితమైన గులాబీ బాస్ కేసీఆర్.. ఇప్పుడు రాజకీయ వ్యూహం మార్చినట్లు తెలుస్తోంది. తననే ఎవరైనా ఫాలో కావాలని అనుకునే ఆయన.. ఇప్పుడ ద్రవిడ పార్టీని ఫాలో అవుతున్నారు.తమిళనాడులో అధికారంలో ఉన్న డీఎంకే పార్టీ నిర్మాణాన్ని కేసీఆర్ అధ్యయనం చేస్తున్నారు. డీఎంకే పార్టీకి, భారత రాష్ట్ర సమితికి కొన్ని పోలికలు ఉన్నాయి. రెండు పార్టీలు కూడా స్థానిక అంశాలను ప్రాతిపదికగా చేసుకొని ఏర్పడ్డవి. రెండు పార్టీల్లోనూ విపరీత ప్రాంతీయ వాదం.. తత్వం ఉంటుంది. రెండూ కూడా జాతీయ పార్టీలను వ్యతిరేకించే పార్టీలు.. ఒక వ్యక్తి సెంట్రిక్‌గా నిర్మాణమైన పార్టీలు. ఇందుకోసమే కేసీఆర్, డీఎంకే పార్టీ స్ట్రక్చర్‌పై అధ్యయనం చేస్తున్నారు. బీఆర్ఎస్ కన్నా ముందే డీఎంకేకి తమిళనాడులో బలమైన పునాదులు ఉన్నాయి. కానీ బీఆర్ఎస్ పార్టీకి ఆ స్థాయిలో బలమైన నిర్మాణం లేదు. అన్నా డీఎంకే ఎన్నిసార్లు అధికారంలోకి వచ్చినా డీఎంకే నుంచి చేరికలు లేవు.. కానీ ఇక్కడ మాత్రం పార్టీ ఫిరాయింపులు విపరీతంగా కనిపిస్తున్నాయి. ఈ విషయంపై దష్టి పెట్టారు కేసీఆర్. ఇందుకోసం మాజీ ఎమ్మెల్యే సుమన్ నేతత్వంలో ఒక బృందాన్ని చెన్నైకి పంపించారు. డీఎంకే ఎమ్మెల్యే శంకర్ ఈ బృందానికి పార్టీకి సంబంధించిన వివరాలను సవివరంగా వెల్లడించారు.డీఎంకేలో ప్రభుత్వం కన్నా పార్టీకే నేతలు అధిక ప్రాధాన్యం ఇస్తారు. ఎవరైనా ఎమ్మెల్యేని మంత్రి పదవి కావాలా..? జిల్లా అధ్యక్ష పదవి కావాలా..? అంటే జిల్లా అధ్యక్ష పదవి వైపే మొగ్గుచూపుతారు.. అక్కడ పార్టీకి అంతగా ప్రాధాన్యం ఇస్తారు.. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు కమిటీలు, కమిటీల మధ్య సమన్వయం చాలా బలంగా ఉంటుంది. పార్టీ కార్యాలయాలు ప్రతీరోజు ఏదో కార్యక్రమంతో యాక్టివ్ గా ఉంటాయి. ఎమ్మెల్యేలు మంత్రులు కూడా పార్టీ కార్యాలయాల్లో కార్యకర్తలకు ప్రతీరోజు అందుబాటులో ఉంటారు. పథకాల రూపకల్పన, అమలులోనూ పార్టీ సూచనలే కీలకంగా ఉంటాయి.చెన్నై వెళ్లిన బీఆర్ఎస్ బృందం డీఎంకే పార్టీ విధానాలు, అనుసరిస్తున్న తీరు, పార్టీకి, ప్రభుత్వానికి మధ్య సంబంధాలు, పార్టీకి నేతలు ఇచ్చే ప్రాధాన్యం తదితర అంశాలు తెలుసుకుంటున్నారు. వాటిని భారత రాష్ట్ర సమితిలోనూ ఇంప్లిమెంట్ చేయాలని గులాబీ బాస్ ఆలోచిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం చెన్నైలో పర్యటిస్తున్న బీఆర్ఎస్ బృందం హైదరాబాద్ చేరుకున్న వెంటనే కేసీఆర్‌కు నివేదిక ఇస్తుంది. ఆ తర్వాత ముఖ్య నేతల టీం మరోసారి చెన్నై వెళ్తుంది. వచ్చేనెల చివరికి పార్టీలో మార్పులు చేర్పుల విషయంలో డీఎంకేను ఫాలో కావాలన్నది కేసీఆర్ ఆలోచన అని పేర్కొంటున్నారు..

# ఆకలికి ఫుల్ స్టాప్ పెట్టాం

- కూటమి ప్రభుత్వం వంద రోజుల్లోపే హామీని నిలబెట్టుకున్నాం
- పేదవారిని ఎగతాళి చేసేలా వైకాపా ఎమ్మెల్యే మాట్లాడటం బాధాకరం
- మంగళగిరి ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటాం
- నులక పేట, మంగళగిరి పాతబస్టాండ్ వద్ద అన్న క్యాంటీన్లను ప్రారంభించిన మంత్రి లోకేష్
- సామాన్యులతో కలిసి టిఫిన్ చేసిన మంత్రి



**జయభేరి, మంగళగిరి :**
అన్న క్యాంటీన్ల ఏర్పాటుతో ఆకలికి ఫుల్ స్టాప్ పెట్టింది తెలుగుదేశం, జనసేన, బీజేపీ ప్రభుత్వం అని విద్య,ఐటీ,ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. శుక్రవారం మంగళగిరి నియోజకవర్గం తాడేపల్లిలోని నులకపేట, మంగళగిరి పాతబస్టాండ్ వద్ద ఏర్పాటుచేసిన అన్న క్యాంటీన్లను కూటమి నేతలతో కలిసి ప్రారంభించారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య రిబ్బన్ కట్ చేసి అన్న క్యాంటీన్లు ప్రారంభించారు. అన్న క్యాంటీన్‌లలో ప్రజలకు స్వయంగా ఉదయం అల్పాహారం వడ్డించిన మంత్రి నారా లోకేష్.. అన్న క్యాంటీన్ వెబ్ సైట్ వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. టోకెన్ జారీ ప్రక్రియ, విరాళాల కోసం రూపొందించిన వెబ్ సైట్ ను పరిశీలించారు.

**కూటమి ప్రభుత్వం వంద రోజుల్లోపే అన్న క్యాంటీన్ల హామీ నిలబెట్టుకున్నాం**
గతంలో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అన్న క్యాంటీన్లను ప్రారంభించారు. అందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 203 అన్న క్యాంటీన్లను ప్రారంభించాం. 2024 ఎన్నికల సమయంలో బాబు సూపర్6 హామీలతో పాటు అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోగానే అన్న క్యాంటీన్ల ఏర్పాటు హామీని నిలబెట్టుకున్నాం. 100 అన్న క్యాంటీన్లను ప్రారంభించాం. మిగతా వాటిని కూడా యుద్ధప్రాతిపదికన ప్రారంభిస్తాం. జగన్ రెడ్డి పాలనలో ఒకే ఒక్క సంతకంతో అన్న క్యాంటీన్లను మూసేశారు. దీనిపై కౌన్సిల్ లో నేను నిలదీయగా.. అన్న క్యాంటీన్లను ప్రారంభిస్తామని ఆనాటి మున్సిపల్ శాఖ మంత్రి హామీ ఇవ్వడం జరిగింది. కానీ దాని ఊసే లేదు. ప్రశ్నిస్తే ఖర్చు ఎక్కువ అవుతుందని చెప్పారు.

**ప్రతిపక్షంలో మంగళగిరి నియోజకవర్గ ప్రజల కోసం 4 అన్న క్యాంటీన్ల నిర్వహణ**
ప్రతిపక్షంలో ఉండగా మంగళగిరి నియోజకవర్గ ప్రజల కోసం నారా లోకేష్ 4 అన్న క్యాంటీన్లను నిర్వహించారు. మంగళగిరి పట్టణం, తాడేపల్లిలోని నులకపేట, దుగ్గిరాలలోని రైలుపేట, రేవేంద్రపాడులో సొంత నిధులతో అన్న క్యాంటీన్లు ఏర్పాటుచేశారు. రూ.2కే మధ్యాహ్న భోజన సదుపాయం కల్పించారు. వందలాది మంది పేద ప్రజల ఆకలి తీర్చారు. దీంతో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా బడుగు బలహీన వర్గాల కోసం 29 సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. సొంత నిధులతో తోపుడు బండ్లు, ప్రజల దాహార్తి తీర్చేందుకు జలధార వాటర్ ట్యాంకర్లు, వైద్యసేవలకు ఆరోగ్యరథాలు, స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలకు కుట్టుమిషన్లు, చేనేతలకు మగ్గాలు, స్వర్ణకారులకు పనిముట్లు, వికలాంగులకు ట్రైసైకిళ్లు, పాదచారులు సేదదీరేందుకు సిమెంటు బల్లలు అందజేశారు.

**సామాన్యులతో కలిసి టిఫిన్ చేసిన మంత్రి**
మంగళగిరి పాతబస్టాండ్ వద్ద ప్రారంభించిన అన్న క్యాంటీన్ లో సామాన్యులతో కలిసి మంత్రి నారా లోకేష్ టిఫిన్ చేశారు. ఈ సందర్భంగా తనతో పాటు టిఫిన్ చేస్తున్న అజయ్ నగర్ కు చెందిన భవన నిర్మాణ కార్మికుడు జోసఫ్ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. రోజుకు ఎంత కూలీ వస్తుందని, గతంలో రాజధాని పనులు ఉన్నప్పుడు ఎలా ఉండేదని ఆరా తీశారు. ప్రస్తుతం తనకు రోజుకు రూ.700 కూలీ వస్తుందని, భార్యాపిల్లలు ఉన్నారని జోసఫ్ తెలిపాడు. మరో నెలరోజుల్లో అమరావతి పనులు ప్రారంభమవుతాయని, అప్పుడు ఖాళీ ఉండదని మంత్రి లోకేష్ భరోసా ఇచ్చారు.

**జగన్ రెడ్డి వృథా ఖర్చుతో పేదలకు మూడు పుటలా అన్నం లభించేది**
జగన్ రెడ్డి మన పాస్ పుస్తకాలపైన, సర్వేరాళ్లపైన తన ఫోటోలు ముద్రించేందుకు రూ.700 కోట్లు ఖర్చు చేశారు. విశాఖ రుషికొండపై రూ.500 కోట్ల ఖర్చుతో విలాసవంతమైన ప్యాలెస్ నిర్మించారు. సొంత పత్రిక సాక్షికి 50శాతం ఐ అండ్ పీఆర్ బడ్జెట్ రూ.400 కోట్లతో ప్రకటనలు ఇప్పించారు. 203 అన్న క్యాంటీన్ల నిర్వహణకు ఏడాదికి సుమారు రూ.200 కోట్లు ఖర్చువుతోంది. రుషికొండ ప్యాలెస్ కు పెట్టిన డబ్బులతో నిరుపేద కుటుంబాలకు రెండున్నర సంవత్సరాలు మూడు పూటలా భోజనం లభించేది. సాక్షికి ఇచ్చిన డబ్బులు ద్వారా రెండేళ్లు, సర్వే రాళ్ల ఖర్చు, పాస్ పుస్తకాల బదులు మూడేళ్లు అన్న క్యాంటీన్లు నడిపించవచ్చు. అన్న ఎన్టీఆర్ పేద ప్రజలే తమ దేవుళ్లని నినదించారు. నాడు, నేడు ఎప్పుడూ టీడీపీజనసేనబీజేపీ పార్టీలు నిరుపేద కుటుంబాల గురించే ఆలోచిస్తాయి. అందులో భాగంగనే మూసేసిన అన్న క్యాంటీన్లు తిరిగి ప్రారంభించాం.

**వైకాపా ఎమ్మెల్యే పేదవారిని ఎగతాళి చేసేలా మాట్లాడటం బాధాకరం**
అన్న క్యాంటీన్ల ఏర్పాటుపై వైకాపా ఎమ్మెల్యే పేదవారిని ఎగతాళి చేసేలా మాట్లాడటం బాధాకరం. మీరు చేతగానివాళ్లు. నిరుపేద కుటుంబాలకు మూడు పూటలా భోజనం పెట్టలేని అసమర్థులు. నిరుపేద కుటుంబాలను అవమానించే హక్కు మీకు ఎవరిచ్చారు? దీనిపై ఫేక్ జగన్ ఎక్కడా స్పందించరు, ఖండించలేదు. ఏ ప్రభుత్వం నిరుపేద కుటుంబాల గురించి ఆలోచిస్తోందో, ఎవరు పెత్తందార్ల గురించి ఆలోచిస్తున్నారో ప్రజలందరూ గమనించాలి.

**మంగళగిరి ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటాం**
మంగళగిరి ప్రజలను నన్ను భారీ మెజార్టీతో ఆశీర్వదించారు. నాపై బాధ్యత చాలా పెరిగింది. ఎన్నికల ప్రచారంలో నేను మంగళగిరి ప్రజలకు అనేక హామీ ఇచ్చా. పద్ధతి ప్రకారం ఆ హామీలన్నీ నెరవేరుస్తాం. మొదటి మూడేళ్లలోనే ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలనే లక్ష్యంతో పనిచేస్తున్నా. దశాబ్దాలుగా మంగళగిరి ప్రజలు ప్రభుత్వ, రైల్వే, కొండ, వాగు పోరంబోకు భూముల్లో నివసిస్తున్నారు. వారికి శాశ్వత భూహక్కులు కల్పించే ప్రక్రియ ప్రారంభించాం. చేనేత సోదరులకు జీఎస్టీ రద్దుపై కేంద్రంతో సంప్రదించడం జరిగింది. అవసరమైతే రాష్ట్రమే జీఎస్టీ చెల్లిస్తుందని హామీ ఇచ్చా. స్వర్ణకారుల కోసం జెమ్స్ అండ్ జ్యూయలరీ పార్క్ ఏర్పాటు చేస్తాం. వారి అత్యాధునిక నైపుణ్యశిక్షణ అందిస్తాం. దీనిపై ఇప్పటికే అధికారులకు ఆదేశాలు జారీచేయడం జరిగింది. త్వరలోనే దీనిని ప్రారంభిస్తాం. భూగర్భ డ్రైనేజీ, 24 గంటల తాగునీరు, అండర్ గ్రౌండ్ విద్యుత్ తీగలు ఏర్పాటు వంటి వినూత్న ఆలోచనలతో ముందుకు వెళ్తున్నాం. ప్రతి హామీని తూచా తప్పకుండా కూటమి ప్రభుత్వం, వ్యక్తిగతంగా నిలబెట్టుకుంటాం. మంగళగిరిలోని పానకాల లక్ష్మీ నరసింహ దేవస్థానాన్ని అభివృద్ధి చేస్తాం. పట్టణంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తాం. త్వరలోనే ప్రణాళికలను ప్రజల ముందు పెడతాం. ప్రభుత్వాలు మారినా అన్న క్యాంటీన్లు ఆగకూడదు
తిరుమలలో మొట్టమొదటి సారిగా అన్న ఎన్టీఆర్ అన్నదానం ప్రక్రియను ప్రారంభించారు. దాతలు ఆనాడు రూ.3కోట్లు అందజేశారు. ఇప్పుడు దాదాపు రూ.1800 కోట్ల ఫిక్స్ డ్ డిపాజిట్లు అన్నదానం ట్రస్ట్ కు ఉన్నాయి. ప్రభుత్వాలు మారినా మూడు పుటలా భక్తులకు అన్నదానం చేస్తున్నారు. అదేవిధంగా రాష్ట్రంలో శాశ్వతంగా అన్న క్యాంటీన్లు నడవాలనేది మా లక్ష్యం. ఇందుకోసం పారదర్శకంగా ట్రస్ట్ ఏర్పాటుచేస్తాం. దాతలు ముందుకు రావాలని ఇప్పటికే చంద్రబాబునాయుడు గారు పిలుపునిచ్చారు. పెనుమత్స శ్రీనివాసరాజు కోటి విరాళంతో పాటు వచ్చే ఐదేళ్లు కోటి రూపాయలు ఇవ్వనున్నారు. నా తల్లి భువనేశ్వరి గారు కూడా కోటి విరాళం ఇచ్చారు. అందరూ ముందుకు రావాలని పిలుపునిస్తున్నా. పవిత్ర బాధ్యత మనపై ఉంది. ఆకలిలేని ఆంధ్ర రాష్ట్రాన్ని తీర్చిదిద్దాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. కలిసికట్టుగా సాధిద్దాం. ప్రభుత్వాలు మారినా అన్న క్యాంటీన్లు ఆగకూడదు.

**ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీలను బలోపేతం చేస్తాం**
ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో 50శాతం అడ్మిషన్లు మాత్రమే ఉన్నాయి. అడ్మిషన్లు పెంచాల్సి బాధ్యత నాపై ఉంది. గత ప్రభుత్వం పాఠశాలలను నిర్లక్ష్యం చేయడంతో 2 లక్షల మంది విద్యార్థులు తగ్గిపోయారు. ఉపాధ్యాయులు బోధనపైనే దృష్టి పెట్టేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రైవేటు పాఠశాలలతో పోటీ పడేలా తీర్చిదిద్దుతాం. సెర్చ్ కమిటీ ఏర్పాటుచేసి త్వరలోనే యూనివర్సిటీల్లో శాశ్వత వీసీలను ఏర్పాటుచేస్తాం.

## హరీశ్ రాజీనామా చేస్తారా

ఇబ్బందులు వస్తే వ్యవసాయ శాఖ పరిష్కరిస్తుందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ మాటిస్తే అది శిలాశాసనం లాంటిదని, ఆరు గ్యారంటీలతోపాటు ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకొని తీరుతామని సీఎం స్పష్టం చేశారు. ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ అసాధ్యం అని, ఒకవేళ కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేస్తే పదవులకు రాజీనామాలు చేస్తామన్న ప్రతిపక్ష నేతలు ఇప్పటికైనా తప్పు తెలుసుకొని తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని ముఖ్యమంత్రి సూచించారు.సాగుకు జీవం రైతుకు ఊతం బహిరంగ సభలో ముఖ్యమంత్రితోపాటు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గారు, మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు గారు, ఉత్తమ్ కుమార్ రెడ్డి గారు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి గారు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి గారు, పలువురు ఎంపీలు, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## మంకీ పాక్స్ ప్రమాదం

వెలుగుచూసింది. అప్పటి నుంచి అది వస్తూ పోతూ అక్కడి జనాన్ని పీడిస్తోంది.గతేడాది జనవరి నుంచి ఇప్పటి వరకు కాంగోలో 27వేల కేసులు నమోదయ్యాయి. పదకొండు వందల మరణాలు సంభవించాయి. మంకీపాక్స్ అనే వైరస్ నుంచి ఈ వ్యాధి ప్రబలుతుంది. మామూలు అమ్మవారితో పోల్చితే దీని ప్రభావం కొంత తక్కువే ఉంటుంది. పరిశోధనల కోసం తీసుకొచ్చిన కోతుల్లో మొట్టమొదటి సారి ఈ వ్యాధిని 1958లో డెన్మార్క్‌లో గుర్తించారు. అందుకే దీనికి మంకీ పాక్స్ అని పేరు పెట్టారు. జ్వరం, తలనొప్పి, కండరాల నొప్పి, అలసట, వాపుతో పాటు చీము నిండిన పొక్కులు ఈ వ్యాధి సోకిన వ్యక్తుల్లో సాధారణంగా కనిపిస్తాయి. ఈ పొక్కులు ముఖంపై మొదలై క్రమంగా శరీరమంతా విస్తరిస్తాయి. సాధారణంగా ఈ పరిస్థితి రెండు నుంచి నాలుగు వారాలు ఉంటుంది. ఏ చికిత్స తీసుకోకున్నా అది తగ్గిపోతుంది. కాని ఆ తర్వాత దాని వల్ల రకరకాల సమస్యలు తలెత్తాయి. కొన్ని సందర్భాల్లో అది మరణానికీ దారితీస్తుంది. రోగనిరోధకశక్తి తక్కువ ఉండేవాళ్లు దీని బారిన పడితే కోలుకోవడం కష్టమే.ప్రస్తుతం ఈ వ్యాధి ప్రభావం 116దేశాలపై ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపింది. ఇప్పటి వరకు తూర్పు, పశ్చిమ, మధ్య ఆఫ్రికా దేశాల్లో ఉన్న ఎంపాక్స్ ఇప్పుడు అమెరికా, యూరోప్‌కు కూడా వ్యాపించింది. మంకీపాక్స్ కేసు 2022లో మన దేశంలో కేరళలో కూడా ఒకటి నమోదైంది. అయితే, ఈ వ్యాధికి ఎటువంటి చికిత్స లేదు. లక్షణాలను బట్టి చికిత్స అందించడం ప్రస్తుతానికి ఉన్న మార్గం. స్మాల్ పాక్స్ కోసం రూపొందించిన మూడు వ్యాక్సిన్స్ మంకీపాక్స్ నివారణకు కూడా కూడా ఆమోదించారు. అయితే వీటికి ప్రపంచ ఆరోగ్య సంస్థ ధృవీకరణ లేదు.ఇప్పుడు ఎంపాక్స్‌ను హెల్త్ ఎమర్జెన్సీగా ప్రకటించడంతో దీనిపై పరిశోధనకు, వైద్య సాధనాల అందుబాటు పెంచేందుకు నిధుల వెసులుబాటు పెరుగుతుందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ఏది ఏమైనా జాగ్రత్తగా ఉండటమే ప్రస్తుతానికి నివారణా మార్గం.

# ఆ ఆరుగురికే అమాత్య యోగం



**జయభేరి, హైదరాబాద్, ఆగస్టు 16 :**
తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత కాంగ్రెస్ పార్టీ తొలిసారిగా అధికారంలోకి వచ్చింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్న ఆ పార్టీ రాష్ట్ర విభజన తర్వాత అధికారానికి దూరమైంది. మళ్లీ అధికారంలోకి రావడానికి పదేళ్లు పట్టింది. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రంలో పాలనలోనూ ప్రత్యేకత చూపడానికి ప్రయత్నిస్తోంది. సీఎంగా బాధ్యతలు చేపట్టిన రేవంత్‌రెడ్డి గత కాంగ్రెస్ సంస్కృతికి భిన్నంగా అందరినీ కలుపుకుపోతూ పాలన సాగిస్తున్నారు. సమష్టి నిర్ణయాలతో ప్రజాపాలన సాగిస్తున్నారు. ఇదే సమయంలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై దృష్టిపెట్టారు. ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల విద్యుత్ ఉచితంగా అందిస్తున్నారు. ఇక హామీల్లో కీలకమైన రుణమాఫీ కూడా చివరి దశకు వచ్చింది.
ఇప్పటికే రూ.1.,50 లక్షల వరకు పంట రుణాలు మాఫీ చేశారు. ఆగస్టు 15న రూ.2 లక్షల వరకు రుణాలు మాఫీ చేయనున్నారు. దాదాపు 9 నెలలుగా సీఎం, 11 మంది మంత్రులతో పాలన సాగిస్తున్న సీఎం మిగిలిన ఖాళీలు భర్తీ చేయడంపైనా దృష్టి పెట్టనున్నారు. తన టీంలోకి కొత్తవారిని తీసుకోబోతున్నారు.తెలంగాణ మంత్రివర్గ విస్తరణకు రంగం సిద్ధమవుతోంది. కొంత కాలంగా మంత్రివర్గ విస్తరణ పైన చర్చలు జరుగుతున్నాయి. తాజాగా పార్టీ అధినాయకత్వం మంత్రివర్గ విస్తరణతోపాటుగా నామినేటెడ్ పదవుల భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. విదేశీ పర్యటనలో ఉన్న రేవంత్ ఢిల్లీలో రెండు రోజుల్లో పార్టీ హైకమాండ్‌తో భేటీ కానున్నారు. ఆ సమయంలోనే నూతన పీసీసీ చీఫ్.. మంత్రివర్గ విస్తరణ..నామినేటెడ్ పదవులను అధికారికంగా ప్రకటించనున్నారు.రేవంత్ మంత్రివర్గంలో మరో ఆరుగురికి అవకాశం ఉంది. అయితే ఒకేసారి ఆరు పదవులు భర్తీ చేసే అవకాశం లేదని తెలుస్తోంది.
నలుగురిని మాత్రమే ప్రస్తుతానికి ఎంపిక చేసినట్లు సమాచారం. గ్రేటర్ ఎన్నికలను పరిగణలోకి తీసుకొని కాంగ్రెస్ నాయకత్వం వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. మంత్రి పదవుల రేసులో నల్లగొండ నుంచి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, బాలూనాయక్, రంగారెడ్డి జిల్లా నుంచి మల్‌రెడ్డి రంగారెడ్డి, మహబూబ్నగర్ నుంచి వాకిటి శ్రీహరి, నిజామాబాద్ నుంచి సుదర్శన్‌రెడ్డి, ఆదిలాబాద్ నుంచి ప్రేమ్‌సాగర్‌రావు, గడ్డం వివేక్, గడ్డం వినోద్ మంత్రి పదవులకు పోటీ పడుతున్నారు. ప్రాంతీయ - సామాజిక సమీకరణాల్లో భాగంగా సుదర్శన్ రెడ్డి, వాకిటి శ్రీహరి పేర్లు మంత్రి పదవులకు దాదాపు ఖరారైనట్లు సమాచారంమంత్రివర్గ విస్తరణతోపాటు నామినేటెడ్ పదవులనూ భర్తీ చేయనున్నట్లు తెలుస్తోంది. తెలంగాణ పీసీసీ చీఫ్‌గా ఎస్టీని నియమిస్తే బాలూనాయక్‌కు డిప్యూటీ స్పీకర్‌గా ఎంపిక చేసే అవకాశం ఉంది. బీసీ, ఎస్సీ వర్గాల నుంచి టీపీసీసీ చీఫ్‌గా నియమిస్తే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డితో పాటు బాలూనాయక్ కూడా మంత్రి పదవి రేసులో ఉంటారు.
ఆదిలాబాద్లో వెలమ సామాజిక వర్గం నుంచి ప్రేమ్‌సాగర్‌రావు, మాల సామాజిక వర్గం నుంచి గడ్డం వివేక్, గడ్డం వినోద్ పోటీలో ఉన్నారు. మంత్రివర్గంలో చోటు దక్కని నేతలకు డిప్యూటీ స్పీకర్, చీఫ్ విప్ పదవులు ఇస్తారని తెలుస్తోంది.బీసీ కమిషన్ ఛైర్మన్ పోస్టును మున్నూరుకాపు సామాజిక వర్గానికి కేటాయించే ఆలోచనలో సీఎం రేవంత్ ఉన్నట్లు సమాచారం. రాష్ట్రంలో కుల గణన చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో బీసీ కమిషన్ ఛైర్మన్ పోస్టు కీలకంగా మారింది. ఈ పదవికి మున్నూరుకాపు సామాజిక వర్గానికి చెందిన పార్టీ సీనియర్ నాయకులు వి.హన్మంతరావు, గోపిశెట్టి నిరంజన్‌లో ఒకరికి ఇచ్చే చాన్స్ ఉంది. రైతు, విద్యా కమిషన్ ఛైర్మన్లుగా కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి, మాజీ ఐఏఎస్ ఆకునూరి మురళి పేర్లు ఖరారైనట్లు సమాచారం.

# వీరభద్ర స్వామి ఆలయంలో ఘనంగా విగ్రహ ప్రతిష్టా

- పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తజనం.. అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

**జయభేరి, ఆగస్టు 16:**



మేడ్చల్ జిల్లా శామీర్ పేట్ మండల కేంద్రంలోని అతి పురాతన శ్రీ వీరభద్రస్వామి దేవాలయంలో నూతన విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమాలు కన్నుల పండువగా కొనసాగుతున్నాయి. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమాలలో భాగంగా మొదటి రోజు విగ్రహాల ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించగా, రెండవ రోజు శుక్రవారం స్థాపిత దేవతా వాహనములు, మూలమంత్ర జపములు, మూలమంత్ర హవనములు, విగ్రహ మంత్రమూర్తి మహోస్నపము, దాన్య శయ్యాదివాసములు, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. శామీర్ పేట్ కట్ట మైసమ్మ ఆలయ కమిటీ, గ్రామస్థుల సమక్షంలో జరుగుతున్న ఈ పూజా కార్యక్రమాల్లో శ్రీ వీరక్షద్ర స్వామి, శివలింగ అమ్మవారు, ఆంజనేయ స్వామి, నవగ్రహ సీతారామ, గణపతి, ధ్వజస్థంభ, నాగమూర్తి, నందీశ్వర, తదితర విగ్రహ ప్రతిష్ట వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, భక్తులకు అన్నదానం వంటి కార్యక్రమాలు నిర్వహించినట్లు శామీర్ పేట్ కట్టమైసమ్మ ఆలయ కమిటీ సభ్యులు, తెలిపారు. కాగా ఉత్సవాల్లో మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్ కోడలు క్షమిత పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఉత్సవాల కార్యక్రమాలలో భాగంగా చివరి రోజు శనివారం స్థాపిత దేవత పూజలు, దేవత పూజ తత్వ హోమములు, సంపాదజనములు, మండపస్థిత దేవత విగ్రహ యంత్ర మూర్తి ప్రతిష్ట అనంతరం దేవతామూర్తుల అలంకరణ, అర్చనలు, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ, వేదాశ్వీర్వచనము, మహాదాశ్వీరచనము, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందనీ ఆలయ పూజారి గడియారం మురళీధర్ శర్మ తెలిపారు.



## అలియాబాద్, బాబాగూడ గ్రామాల్లో వ్యవసాయ శాస్త్రవేత్తల పర్యటన

- పంట పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడిన శాస్తవేత్తలు
- మేలు రకం దిగుబడి పంటల వైపు మొగ్గు చూపాలని సూచన

**జయభేరి, ఆగస్టు 16:**

మేడ్చల్ జిల్లా శామీర్ పేట్ మండలం అలియాబాద్, బాబాగూడ, గ్రామాల్లో దక్షిణ తెలంగాణ మండల సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ మల్లారెడ్డి, ఏరువాక కేంద్రం భువనగిరి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ అనీల్ కుమార్ పర్యటించారు. అనంతరం అలియబాద్ గ్రామంలో వరిపంట ను పరిశీలించి పంటకు పురుగు, తెగుళ్ళు, ఎరువుల వాడకం, విత్తన రకాల గూర్చి రైతులతో చర్చించి పలు సలహాలు సూచనలు అందచేశారు. అదేవిధంగా బాబాగూడ గ్రామంలో కూరగాయలు, పండ్ల తోటలు వరి పంట పొలాలను పరిశీలించి రైతులతో నేరుగా మాట్లాడారు. మార్కెట్ ధర మరియు విత్తనాల ఖర్చు వివరాలను అడిగి తెలుసుకుని వారికి పలు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో ఏవో రమేష్, ఏఈవో రవియాదవ్, రైతులు రాంరెడ్డి, సురేందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, కృష్ణగౌడ్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## మాజీ మంత్రి కొత్తపల్లిని కలిసిన కాళ్ల పాలెం బుజ్జి

**జయభేరి, కైకలూరు :**

రాధా రంగ మిత్రమండలి ఆంధ్ర తెలంగాణ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు పన్నాస్ పూర్వచంద్రరావు కలకాలం బుజ్జి మాజీ మంత్రివర్యులు నరసాపురం జనసేన నాయకులు కొత్తవల సుబ్బారాయుడును కలిసి త్వరలో కలిదిండిలో రాధా రంగా మిత్ర మండలి ఆఫీసును ప్రారంభిస్తున్న ఆహ్వానానికి రావాలని ఆయన కోరారు.. ఆయన ఈ సందర్భంగా స్పందిస్తూ తప్పకుండా వస్తానని హామీ ఇచ్చారు.. ఈ కార్యక్రమంలో రాధా రంగా మిత్రమండలి సభ్యులు పాల్గొన్నారు.

## ప్రెస్ క్లబ్ (ఎలక్ట్రానిక్ మీడియా) దేవరకొండ డివిజన్ నూతన కమిటీ

**జయభేరి, దేవరకొండ :**



దేవరకొండ డివిజన్ ప్రెస్ క్లబ్ (ఎలక్ట్రానిక్ మీడియా) నూతన కమిటీ అధ్యక్షులుగా నర్రా భానుచందర్ (మహా న్యూస్), ప్రధాన కార్యదర్శిగా నల్లగాస్ నవీన్ కుమార్ యాదవ్ (ఐ న్యూస్), కోశాధికారిగా సముద్రాల వేణు (టీ న్యూస్) ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను శుక్రవారం దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ శాలువా కప్పి సన్మానించారు. ఎలక్ట్రానిక్ మీడియా సభ్యుల సమస్యలు పరిష్కరిస్తానని, అర్హులైన ప్రతి ఒక్క జర్నలిస్టుకు ఇళ్ల పట్టాలు అందజేసి ఇల్లు నిర్మించే విధంగా కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా నూతనంగా ప్రెస్ క్లబ్ (ఎలక్ట్రానిక్ మీడియా) ఎన్నికైన సభ్యులను జర్నలిస్టు మిత్రులు సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయులు యాదవ్, హాథిరాం నాయక్, వంగాల రమేష్ చారి, సంకోజు మణికంఠ చారి, గాజుల వినయ్, కేతావత్ రాధాకృష్ణ, వర్కాల పాండు తదితరులు పాల్గొన్నారు.




## అనంతారంలోని పాఠశాలకు సామాగ్రి బహుకరణ

- విద్యార్థులకు నోట్ పుస్తకాలు, బ్యాగ్స్ అందచేసిన లరాస్ ఫార్మా కంపెనీ

**జయభేరి, ఆగస్టు 16:**

శామీర్ పేట్ మండలం తుర్కపల్లి లోని లరాస్ ఫార్మా కంపెనీ ఆధ్వర్యంలో అనంతారం లోని ప్రాథమిక పాఠశాల లోని విద్యార్థులకు బ్యాగ్స్, నోట్ పుస్తకాలు, సుమారు ఇరవై వేలు విలువ చేసే స్టేషనరీ నీ అందజేశారు. అదేవిదంగా నగరానికి చెందిన ఆర్మీ జవాన్ నరేందర్ పాఠశాలకు 2 ఫ్యాన్లు, వాటర్ డిస్పెన్సర్లు, 2 వాటర్ బాటిల్స్ ను అందజేశారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని పాఠశాలకు తమ వంతు సాయంగా సామాగ్రిని అందచేసినట్లు ఈ సందర్భంగా వారు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నరసింహ, విద్యాకర్, పాపిరెడ్డి,మాజీ ఎంపిటిసి అఖిలేష్ రెడ్డి,పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## గౌతు లచ్చన్న 115వ జయంతి



**జయభేరి, కైకలూరు:**

కైకలూరు నియోజకవర్గం ముదినేపల్లి మండలం ముదినేపల్లి గురజ రోడ్ నందు స్వాతంత్ర సమర యోధులు పోరాట వీరులు బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి ఉద్యమాల నిప్పుకనిక సర్దార్ గౌతు లచ్చన్న 115వ జయంతి సందర్భంగా తెలుగుదేశంపార్టీ నాయకులు కొడాలి వినోద్ వారి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించి మజ్జిగ పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగుదేశంపార్టీ నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, ఎన్డీఏ కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## యువజన కాంగ్రెస్ నాయకుడు నవీద్ పుట్టినరోజు వేడుకలు

**జయభేరి, దేవరకొండ :**
**జయభేరి,**




దేవరకొండ పట్టణ 12వ వార్డు యువజన కాంగ్రెస్ నాయకుడు,మృదుస్వభావి, ప్రతి ఒక్కరిని అక్కున చేసుకునే స్నేహశీలి షేక్ నవీద్ పుట్టినరోజు వేడుకలు శుక్రవారం పట్టణంలోని మహాలక్ష్మి మహిళా మండలి వృద్ధాశ్రమంలో ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా మహాలక్ష్మి మహిళా మండలి వృద్ధాశ్రమంలో వృద్ధ మాతలతో కలిసి కేక్ కట్ చేసి వృద్ధులకు పాలు, పండ్లు,పంపిణీ చేశారు. కాసేపు వారితో ముచ్చటించి వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నవీద్ మాట్లాడుతూ..వృద్ధాశ్రమంలో వృద్ధ మాతల నడుమ తను పుట్టినరోజు వేడుకలు జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందని, వయోవృద్ధుల ఆశీస్సులు తమపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. తన పుట్టినరోజును పండుగలా జరిపిన ప్రతి ఒక్క స్నేహితుడికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. యువకులకు ఆదర్శమైన నవీద్ ఆయురారోగ్యాలతో ఉండాలని, ఇలాంటి జన్మదిన వేడుకలు ఎన్నో, మరెన్నో, ఎన్నెన్నో జరుపుకోవాలని, రాజకీయ రంగంలో ఉన్నత పదవులు అధిరోహించి నేటి యువతకు ఆదర్శం కావాలని, వృద్ధాశ్రమానికి తనకు తోచిన సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నవీద్ సతీమణి హనీఫా ఫర్హీన్, తల్లి నాజ్మా బేగం, మిత్ర బృందం మొయిన్, మహేమూద్, సాజీద్ హుస్సేన్, ఇలియాస్, అజీజ్, అన్వర్, సోహేల్ తదితరులు పాల్గొన్నారు.



## ట్రాన్స్ ఫార్మర్ చుట్టూ పిచ్చి మొక్కలు తొలగింపు

- లాల్ గడి మలక్ పేటలో విద్యుత్ సమస్యపై స్పందించిన ఏఈ శ్రీనివాస్ గౌడ్

**జయభేరి, ఆగస్టు 16:**

మేడ్చల్ జిల్లా శామీర్ పేట మండలం లాల్ గడి మలక్ పేట్ లోని అంబేద్కర్ రోడ్డు మార్గంలో ఉన్న మినీ ట్రాన్స్ ఫార్మర్ వద్ద పిచ్చి మొక్కలు చెట్ల కొమ్మలతో నిండిపోయి ఉంది. దీంతో తరుచు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడి అంబేద్కర్ నగర్ కాలనీ వాసులకు విద్యుత్ కోతలు తప్పడం లేదు. ఈ సమస్యపై కాలనీ వాసులు అలియాబాద్ ఏఈ శ్రీనివాస్ గౌడ్ కు ఫిర్యాధు చేశారు. ఈ సమస్యపై స్పందించిన ఏఈ శ్రీనివాస్ గౌడ్ , జెల్ మ్ భాస్కర్, సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకుని ట్రాన్స్ ఫార్మర్ చుట్టు ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు. అదేవిదంగా ట్రాన్స్ ఫార్మర్ చుట్టు రక్షణ కవచం ఏర్పాటు చేశారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు కరెంట్ సరఫరాలో అంతరాయం ఉండేదని అయితే తాము చేసిన ఫిర్యాదుతో ఏఈ శ్రీనివాస్ గౌడ్ స్పందించి విద్యుత్ సరఫరాను మెరుగు పరచడంతో కాలనీ ప్రజలు ఆయనకు దన్యవాదాలు తెలిపారు.

## బ్యూటీ పార్లల్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న సింగిరెడ్డి



**జయభేరి, మేడిపల్లి :**

బోడుప్పల్ గ్రీన్ సిటీ కాలనీ రోడ్ నం 1 నందు ప్రారంభమైన మౌనిక బ్యూటీ పార్లర్ ప్రారంభించిన బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ 5వ డివిజన్ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మారెడ్డి. పార్లర్ యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 3వ డివిజన్ కార్పొరేటర్ కొత్త చందర్ గౌడ్, 8వ డివిజన్ కార్పొరేటర్ సీసా వెంకటేష్ గౌడ్, 14వ డివిజన్ కార్పొరేటర్ కుంభం కిరణ్ కుమార్ రెడ్డి, 21వ డివిజన్ కార్పొరేటర్ భూక్యా సుమన్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.




## కేటీఆర్ దిష్టి బొమ్మ దహనం

**జయభేరి, ఘట్కేసర్ :**



మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, TPCC ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ ఆదేశాల మేరకు, ఘట్కేసర్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మామిండ్ల ముత్యాల యాదవ్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలోని మహిళల కోసం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ఉచిత బస్సు ప్రయాణం గూర్చి ఓర్వలేక BRS పార్టీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిన్న ఉచిత బస్సు ప్రయాణం గూర్చి మహిళలు రికార్డింగ్ డాన్సులు చేయాలి అంటూ, మహిళలను అవమాన పరుస్తూ, అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు నిరసనగా దిష్టి బొమ్మ దహనం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఘట్కేసర్ మున్సిపల్ చైర్మన్ ముల్లి పావని జంగయ్య యాదవ్, రైతు సమన్వయ సమితి మండల మాజీ అధ్యక్షుడు కొంతం అంజిరెడ్డి, Dcc కార్యదర్శి ఉల్లి ఆంజనేయులు, ఉపాధ్యక్షులు K నాగరాజు ముదిరాజ్, మాజీ వార్డు సభ్యులు కొంతం రాంరెడ్డి, రహీం, గడీల సంజీవ రెడ్డి, బొంత వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు K నర్సింగ్ రావ్, మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఫరూక్ భాయ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు m శ్రీనివాస్,సేవాదళ్ అధ్యక్షులు రాజారత్నం, సంయుక్త కార్యదర్శి విజయ్, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు రఫీయుద్దీన్,మైనారిటీ నాయకులు అబ్దుల్ ఖయ్యుమ్ భాయ్, సీనియర్ నాయకులు మేకల సునీల్ కుమార్, శివ,నాయకులు గొరకంటి రవీందర్, G.ప్రశాంత్, కడపోల్ల రాజు, దేశం రవి గౌడ్, యాదగిరి, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.



## లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో 142 మంది లబ్ధిదారులకు శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్ సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేశారు. 142 లబ్ధిదారులకు 42 లక్షల విలువ చేసే చెక్కులను పంపిణీ చేసి తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలకు కూడా కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.





# ఛాతీ మీద తెల్లని చారలున్నాయా?

శరీరంలో స్ట్రెచ్ మార్క్స్ ఎక్కడైనా రావచ్చు. కొంతమంది మహిళల్లో చాతీ దగ్గర స్ట్రెచ్ మార్క్స్ వచ్చి ఇబ్బంది పెడతాయి. ఈ కారణంలో ఎబ్బెట్టుగా కనిపిస్తుంది కొన్ని రకాల డ్రెస్సులు కూడా వేసుకోలేరు. దీనికి కారణాలు, ఇంట్లోనే తగ్గించుకునే సహజ మార్గాలు తెల్సుకోండి.

తొడలు, పిరుదులు, చంకల్లో, పొత్తికడుపు దగ్గర ఎక్కువగా స్ట్రెచ్ మార్క్స్ వస్తుంటాయి. కానీ కొంతమంది మహిళల్లో చాతీ దగ్గర కూడా ఈ సమస్య కనిపిస్తుంది. బరువు పెరగడం తగ్గడం నుంచి ప్రెగ్నెన్సీ దాకా దీనికి అనేక కారణాలున్నాయి. చూడ్డానికి తెల్లని చారల్లాగా ఉండే వీటిని కొన్ని ఇంటి చిట్కాలతో తగ్గించుకోవచ్చు.

**స్ట్రెచ్ మార్క్స్:**
చర్మం ఎక్కువగా సాగినా, దగ్గరికి అయినా స్ట్రెచ్ మార్క్స్ కనిపిస్తాయి. ]చర్మంలో వచ్చే మార్పులు చర్మం సాగుదలకు కారణమయ్యే కొలాజిన్, ఎలాస్టిన్ మీద ప్రభావం చూపుతాయి. చాతీ పరిమాణం పెరగడం తగ్గడం వల్ల కొలాజెన్ దెబ్బతింటుంది. దాంతో అక్కడ స్ట్రెచ్ మార్క్స్ వస్తాయి.

**1. యుక్త వయసు:**
ఈ యవ్వన వయసులో హార్మోన్లలో చాలా మార్పులొస్తాయి. దీంతో చాతీ పరిమాణంలో మార్పు వస్తుంది. రొమ్ము కణజాలం పెరగడం వల్ల చర్మం సాగుతుంది. చర్మం పలుచగా మారి స్ట్రెచ్ మార్క్స్ కనిపిస్తాయి. పిరుదులు, తొడలల్లో కూడా ఈ సమస్య ఉంటుంది.

**2. ప్రెగ్నెన్సీ:**
ముఖ్యమైన కారణాల్లో ప్రెగ్నెన్సీ కూడా ఒకటి. గర్భవతిగా అయిన 6 వారాల్లోనే చాతీ పరిమాణంలో మార్పు రావడం మొదలవుతుంది. ఈస్ట్రోజెన్ స్థాయులు పెరగడం వల్ల చాతీ పెరుగుతంది. ఇలా ఉన్నట్లుండి మార్పు రావడంతో చాతీ మీద స్ట్రెచ్ మార్క్స్ వచ్చేస్తాయి.

**3. బరువు:**
మహిళల్లో బరువు పెరిగితే సాధారణంగా చాతీ పరిమాణం కూడా పెరగుతుంది. దాంతో చాతీలో స్ట్రెచ్ మార్క్స్ వస్తాయి. అలాగే బరువు తగ్గినప్పుడు రొమ్ముల్లో ఉండే కొవ్వు కణజాలం తగ్గిపోవడం వల్ల కూడా ఈ సమస్యకు కారణమే.

**రాకుండా జాగ్రత్తలు:**
రోజుకు కనీసం 8 నుంచి 10 గ్లాసుల నీళ్లు తాగాలి. చర్మం తేమగా ఉంటే సాగే గుణాన్ని సంపాదించుకుంటుంది. చర్మానికి మాయిశ్చరైజర్ రాయడం, మృతకణాలు తొలగించడానికి ఎక్స్‌ఫోలియేషన్ చేయడం మర్చిపోవద్దు. విటమిన్ సి ఎక్కువుంటే బెర్రీలు, క్యాబేజీ, కివి, బటానీ, క్యాప్సికం, బ్రొకలీ, పైనాపిల్, పాలకూర, టమాటాలు ఎక్కువగా తీసుకోవాలి. ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్లుండే వాల్‌నట్స్, అవిసెగింజలు, చియా గింజలు, సాల్మన్, క్యాలీ ఫ్లవర్ తినాలి.

**ఇంటి చిట్కాలు:**

**1. కలబంద గుజ్జు:**
దీంట్లో యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలుంటాయి. స్ట్రెచ్ మార్క్స్ మీద రాసుకుంటే దురద తగ్గుతుంది. క్రమంగా అవి ఎక్కువ అవ్వకుండా ఉంటాయి. దానికోసం నేరుగా కలబంద గుజ్జును సమస్య ఉన్న చోట రాసి పావుగంట మర్దనా చేయాలి. తర్వాత కడుక్కుంటే చాలు. వారానికి రెండు సార్లయినా ఇలా చేస్తే ఫలితం ఉంటుంది.

**2. ఆలివ్ నూనె:**
దీనికి మాయిశ్చరైజింగ్ లక్షణాలు పుష్కలంగా ఉంటాయి. స్వచ్ఛమైన ఆలివ్ నూనెను స్ట్రెచ్ మార్క్స్ ఉన్న చోట రోజూ రాసుకుంటే సమస్య తగ్గుతుంది.

**3. కొబ్బరి నూనె:**
కొబ్బరి నూనె చర్మాన్ని తేమగా ఉంచుతుంది. కొలాజెన్ దెబ్బతినకుండా కాపాడుతుంది. సమస్య ఉన్న చోట ఈ నూనె రాసుకుని చర్మం ఇంకి పోయేదాకా మర్దనా చేయాలి. తరచూ ఇలా చేస్తుంటే సమస్య తగ్గుతుంది.





# యువత తీరు మారింది..

కాబోయే భాగస్వామిలో ఏం ఉండాలని కోరుకుంటున్నారో తెల్సా

అబ్బాయిలకు, అమ్మాయిలకు పెళ్లి విషయంలో ఉండే అభిప్రాయాలు మారుతూ వస్తున్నాయి. వాళ్లు కోరుకునే భాగస్వామి విషయంలో వాళ్ల ఆలోచనా తీరు మారింది. పెళ్లి గురించి చేసిన సర్వే, ఆహారపు అలవాట్ల గురించి చేసిన సర్వేలో కొన్ని విషయాలు బయటపడ్డాయి. అవేంటో చూడండి.

యువతలో పెళ్లి విషయంలో మారిన అభిప్రాయాలు అమ్మాయి అందంగా, సౌమ్యంగా, తెల్లగా ఉండాలి. ఇవే ఇది వరకు పెళ్లి కూతురుని చూసేటప్పుడు పట్టించుకునే విషయాలు. చాలా కాలంగా అమ్మాయిల వివక్షకు కారణమవుతున్న విషయాలు కూడా ఇవే. కానీ కొత్త తరం యువతలో కాబోయే భార్య గురించి ప్రాధాన్యత మారిపోయింది. ఇటీవల బెంగళూరులో నిర్వహించిన ఓ సర్వేలో ఈ విషయం వెల్లడైంది. గతంలో అమ్మాయిల రంగు, స్వభావం గురించి అనేక విషయాలు దాచిపెట్టి పెళ్లి చేయాలనుకునేవారు. ఇప్పుడు వాళ్లే ప్రత్యేకంగా మ్యాట్రిమోనియల్ వెబ్‌సైట్లో వాళ్ల ఇష్టాలను తెలుపుతు ప్రొఫైల్ తయారు చేసుకుంటున్నారు.

**అలాంటి అమ్మాయిలు కావాలి:**
ఇప్పటి అబ్బాయిలు.. అమ్మాయిల అందానికి, సౌమ్య స్వభావానికి ప్రాధాన్యత ఇవ్వట్లేదని సర్వే చెబుతోంది. తెలివితేటలుండి, ఉద్యోగం చేసే సామర్థ్యం ఉన్నవాళ్లు, సున్నితంగా ఉండే అమ్మాయిలకు కావాలని కోరుకుంటున్నారు. అంతే కాకుండా వధూవరులిద్దరికీ ధైర్యంగా ఉండే, సొంతంగా నిర్ణయాలు తీసుకునే, అతిగా ఆలోచించని భాగస్వామి కావాలని కోరుకుంటున్నారు. సర్వేలో పాల్గొన్న బాలికల్లో 46 శాతం మంది తమకు పెళ్లి కంటే కెరీర్ ముఖ్యమని చెప్పారు. నేటి తరానికి ఆర్థిక స్వాతంత్ర్యం చాలా ముఖ్యం. ఈ సర్వేతో సంబంధం ఉన్న రిలేషన్‌షిప్ అడ్వైజర్ పూర్ణిమా భాస్కర్ మాట్లాడుతూ "ఈ మార్పు సమాజానికి చాలా ముఖ్యం. కొన్ని వివక్షల కారణంగా అమ్మాయిల ఆత్మవిశ్వాసం తరచుగా బలహీనపడుతుంది. అటువంటి మార్పు ఆరోగ్యకరమైన సంబంధానికి పునాది వేస్తుంది. అన్నారు.

**సర్వే వివరాలు:**
యువర్ దోస్త్ అనే యూట్యూబ్ ఛానల్ ఇటీవల 5,000 మందిపై సర్వే నిర్వహించింది. సర్వేలో పాల్గొన్న మహిళల్లో 72.2 శాతం మంది పనిలో ఒత్తిడికి గురవుతున్నట్లు అంగీకరించగా, 52 శాతం మంది పనిచేసే పురుషులు ఒత్తిడికి గురయ్యామన్నారు. వర్క్‌లైఫ్ బ్యాలెన్స్ విషయానికి వస్తే, 18 శాతం మంది వర్కింగ్ ఉమెన్స్ దాన్ని సాధించడానికి కష్టపడుతున్నామని చెప్పారు. ఈ సర్వే ప్రకారం 20 శాతం మంది మహిళలు ఎల్లప్పుడూ నిరాశతో ఉంటున్నామని అంగీకరించారు. ఎమోషనల్ స్టేట్ ఆఫ్ ఎంప్లయి రిపోర్ట్ ప్రకారం 18 నుంచి 30 ఏళ్ల మధ్య వయసున్న మహిళల్లో ఒత్తిడి శాతం ఎక్కువగా ఉందని తేలింది.

**పండ్లు, కూరగాయలు:**
తాజాగా ఆహారపు అలవాట్ల గురించి మరో అధ్యయనం కూడా జరిగింది. ఫిట్ నెస్ ట్రాకింగ్ యాప్ మైఫిట్నెస్ పాల్ తాజా అధ్యయనంలో ప్రతి ఐదుగురిలో నలుగురు కొనుగోలు చేసినంతగా కూరగాయలు, పండ్లు తినడం లేదని వెల్లడైంది. ఈ అధ్యయనం ప్రకారం చాలా మంది ప్రతిరోజూ పండ్లు, ఆకుకూరలు తినాలని వారం ప్రారంభంలో నిర్ణయించుకుంటారట. కానీ మంగళవారం నాటికి ఆ ప్రామిస్‌కు బ్రేక్ పడుతోందట. ఆహార పానీయాలకు సంబంధించిన అపోహలపై చేసిన ఈ అధ్యయనంలో పాల్గొన్న వారిలో 18 శాతం మంది తమకు అజీర్ణ సమస్యలు ఉన్నాయని అంగీకరించారు. 15 శాతం మంది తమకు మలబద్ధకం సమస్య ఉందని, 22 శాతం మంది వివిధ కారణాల వల్ల తాము కోరుకున్న ఆహారం తీసుకోలేకపోతున్నామని అంగీకరించారు. ఆహారానికి ఆరోగ్యానికి మధ్య సంబంధాన్ని పట్టించుకోని వారూ ఉన్నారిందులో. "ఈ అధ్యయనం సగటు వ్యక్తికి వారి పేగు ఆరోగ్యానికి సంబంధించిన అవగాహన ఎంత తక్కువగా ఉందో తెలుపుతోంది. ఈ అధ్యయనంలో పాల్గొన్న మూడింట రెండు వంతుల మంది ప్రజలు తమకు ఆహారం, పానీయాలు సరిగ్గానే తీసుకుంటామని నమ్ముతున్నప్పటికీ, వారి ఆరోగ్యం పేలవంగానే ఉంది.

# బ్యాటరీలను రీసైక్లింగ్ చేసే గొప్ప అవకాశం




హైటెక్స్‌లో మూడు ఏకకాల పారిశ్రామిక ప్రదర్శనలు HIMTEX, IPEC, ECO సస్టైన్ ఎక్స్‌పో

450 ప్రదర్శకులు, 20 ఇన్నోవేటర్లు ఉత్పాదక రంగానికి వ్యర్థ పదార్థాల నిర్వహణలో ఉత్పత్తులు, సేవలను ప్రదర్శిస్తున్నారు : శ్రీకాంత్ T.G, బిజినెస్ హెడ్, హైటెక్స్

భారతదేశంలో లిథియం-అయాన్ బ్యాటరీలను రీసైక్లింగ్ (పునరుపయోగించు) చేయడం గొప్ప అవకాశం, దాని బిజినెస్ పరిమాణం $1,000 మిలియన్ల ఉండవచ్చు

లిథియం-ఆధారిత EV బ్యాటరీ పునర్వినియోగం, రీసైక్లింగ్‌ను నియంత్రించే ఏకరీతి నిబంధనలు భారతదేశంలో లేవు. చైనా, యూరప్, USA, జపాన్ అలంటి నియంత్రణలను కలిగి ఉన్నాయి. భారతదేశంలో రీసైక్లింగ్ కోసం నిబంధనలు ఇంకా అభివృద్ధి దశ లోనే ఉన్నాయి : డాక్టర్ వర్గీస్ శామ్యూల్, మాట్లాబ్స్ టెక్నాలజీస్ సహ వ్యవస్థాపకుడు

బ్యాటరీ రీసైక్లింగ్, రెండవ ఉపయోగం భారతదేశంలో పెద్ద మార్కెట్ ఇప్పటి వరకు దీని పై ఎవరు దృష్టిసారించలేదు : డాక్టర్ శైలేంద్ర సరోజ్, ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఎలక్ట్రిక్ వెహికల్ అసోసియేషన్ (I-FEVA)

**హైదరాబాద్, ఆగస్ట్ 16 :**

హైదరాబాద్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఎక్స్‌పోజిషన్స్ లిమిటెడ్ (HITEX), హైటెక్స్‌లో ఆగస్టు 16 నుండి 19 వరకు HIMTEX, IPEC, ECO సస్టైన్ ప్రదర్శనలను ఏకకాలంలో నిర్వహిస్తోంది. ఈ మూడు ఎక్స్‌పోలను పలువురు పారిశ్రామిక, వాణిజ్య సంస్థల నాయకులు లాంఛనంగా ప్రారంభించారు. వీరిలో కొందరు డాక్టర్ శైలేంద్ర సరోజ్, ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఎలక్ట్రిక్ వెహికల్ అసోసియేషన్ (IFEVA) చైర్మన్; డాక్టర్ D.S. సెట్టీ, తెలంగాణ, AP చాప్టర్, ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ ఇంజనీర్స్, రాజ్ కుమార్ శర్మ, ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ రోబోటిక్ & ఆటోమేషన్ ప్రెసిడెంట్; రమేష్ మియ్యపురం, చర్లపల్లి ఇండస్ట్రియల్ అసోసియేషన్‌ఫేజ్ 3 అధ్యక్షుడు, డాక్టర్ అమియా కుమార్ సాహు, చైర్మన్‌టిఎస్ & ఎపి నేషనల్ సాలిడ్ వేస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (NSWAI), తెలంగాణ చిన్న (ఎంఎస్‌ఎంఈ) పరిశ్రమల సంఘాల సమాఖ్య ఎ.భాస్కర్‌రెడ్డి, జీడిమెట్ల పరిశ్రమల సంఘం అధ్యక్షుడు ఎ.ప్రవీణ్‌రెడ్డి.

మూడు ఎక్స్‌పోలు హైదరాబాద్ ఇంటర్నేషనల్ మెషిన్ టూల్ & ఇంజనీరింగ్ ఎక్స్‌పో (HIMTEX 8వ ఎడిషన్), ఇండియా ప్రాసెస్ ఎక్స్‌పో & కాన్ఫరెన్స్ (IPEC), ఎకో సస్టైన్ ఎక్స్‌పో. ఈ ఈవెంట్‌లు ఉత్పాదక రంగంలో తాజా ఆవిష్కరణలు, పరిణామాలను ప్రదర్శించడానికి, నెట్‌వర్కింగ్, సహకారం, వృద్ధికి అవకాశాలను అందించడానికి ఒక చక్కటి వేదికను అందిస్తున్నాయి. మొత్తం మీద, 450 ఎగ్జిబిటర్లు తమ ఉత్పత్తులు, సేవలను ప్రదర్శిస్తున్నారు. ఉత్పాదక రంగానికి సంబంధించిన వ్యర్థ పదార్థాల నిర్వహణలో ఉత్పత్తులు, సేవలను 20 మంది ఆవిష్కర్తలు ప్రదర్శిస్తున్నారని, ట్రై ఎక్స్‌పోస్ నిర్వాహకుడు, హైటెక్స్ బిజినెస్ హెడ్ శ్రీకాంత్ టిజి తెలియజేశారు.

ప్రారంభోత్సవం ముగిసిన వెంటనే, ఇవేస్ట్, రీసైక్లింగ్ మేనేజ్‌మెంట్ & నిబంధనల కోసం సమకాలీన విధానాలపై నాలెడ్జ్ సెషన్‌లో ప్రసంగిస్తూ, డాక్టర్ శైలేంద్ర సరోజ్, iFEVA భారతదేశపు మొట్టమొదటి ఎలక్ట్రిక్ వాహనాల సమాఖ్య అని భారతదేశంలో ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించడానికి దాని లాభాపేక్షలేని సంస్థ అని అన్నారు. ఎలక్ట్రిక్ వాహనాల పరిశోధన, అభివృద్ధి, విస్తరణ. బ్యాటరీ రీసైక్లింగ్ మరియు రెండవ ఉపయోగం భారతదేశంలో ఎవరు ఎక్కువగా ప్రయతించని మార్కెట్. 2023లో భారతదేశ బ్యాటరీ రీసైక్లింగ్ మార్కెట్ విలువ USD 1.97 బిలియన్‌గా ఉందని, ఇప్పటి నుండి 2030 వరకు దాదాపు 9.8% సమ్మేళన వార్షిక వృద్ధి రేటు వృద్ధి చెందుతుందని అంచనా వేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇవ్యర్థాలపై ప్రభుత్వ విధానం, తయారీదారులు, పునరుద్ధరణదారులు, ఇవ్యర్థాల PPPలు, ఇతరులు ఉత్పత్తిదారుల బాధ్యతలపై ఆయన మాట్లాడారు. ఇదే అంశంపై మాట్లాడుతూ.. భారతదేశంలో లిథియంఅయాన్ బ్యాటరీలను రీసైక్లింగ్ చేయడం ఒక గొప్ప అవకాశం, దాని వ్యాపార పరిమాణం $1,000 పరిధిలో ఎక్కడైనావరకు ఉండవచ్చని పరిశోధనా సాధనాల పరిష్కారాలను అందించే మాట్‌లాబ్స్ టెక్నాలజీస్ సహ వ్యవస్థాపకుడు డాక్టర్ వర్గీస్ శామ్యూల్ అన్నారు. లిథియంఅయాన్ బ్యాటరీల కోసం ప్రపంచ డిమాండ్ శిలాజ ఇంధన రహిత ఆర్థిక వ్యవస్థలో లిథియంఅయాన్ బ్యాటరీలది కీలకమైన భూమిక. ఇప్పుడున్న పరిశ్రమ, పరిమాణం, వృద్ధిని బట్టి భవిష్యత్తులో లిథియంఅయాన్ బ్యాటరీ రీసైక్లింగ్‌కు భారీ డిమాండ్ ఉంటుందని ఆయన చెప్పారు. EV బ్యాటరీ పునర్వినియోగం, రీసైకిల్ మార్కెట్ ఇంకా ఆర్థికంగా లాభదాయకంగా లేదు. అయితే, పెరుగుతున్న EV అమ్మకాల వాల్యూమ్‌ల ధోరణి ఆధారంగా, 203035 నాటికి ప్రపంచ మార్కెట్ స్వయం సమృద్ధిగా మారుతుందని అంచనా వేస్తున్నట్లు ఆయన చెప్పారు. 2030 నాటికి, పునర్వినియోగం, రీసైక్లింగ్ కోసం మార్కెట్ పరిమాణం 157 MWH (బ్యాటరీ యొక్క మొదటి జీవితం 10 సంవత్సరాలు, రెండవ జీవితకాలం ఐదేళ్లు అని ఊహిస్తే) చేరుకునే అవకాశం ఉందని ఆయన చెప్పారు. ఇంకా మాట్లాడుతూ.. ప్రస్తుతం భారతదేశంలో లిథియం ఆధారిత EV బ్యాటరీ పునర్వినియోగం, రీసైక్లింగ్‌ను నియంత్రించే ఏకరీతి నిబంధనలు ఏవీ లేవు. చైనా, యూరప్, USA, జపాన్ స్పష్టమైన నిబంధనలను కలిగి ఉన్నాయి. దీనికి విరుద్ధంగా, రీసైక్లింగ్ కోసం నిబంధనలు భారతదేశంలో ఇంకా అభివృద్ధి దశలోనే ఉన్నాయి, ప్రతిపాదిత విధానం రీసైక్లింగ్ సౌకర్యాలను ఏర్పాటు చేయడానికి ప్రోత్సాహకాలను అందిస్తుంది. ఉత్పత్తిదారులు ఉపయోగించిన బ్యాటరీలను సేకరించడం తప్పనిసరి చేసింది.

ఈ మూడు ప్రదర్శనలు తయారీకి ఏకీకృత వేదిక అని హైటెక్స్ బిజినెస్ హెడ్ శ్రీఅక్ంత్ టిజి తన స్వాగత ప్రసంగంలో తెలిపారు. పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (PMI) గరిష్ఠ స్థాయికి చేరుకోవడంతో భారతదేశ తయారీ రంగం అద్భుతమైన వృద్ధిని కనబరిచింది. మెషిన్ టూల్స్ తయారీ రంగానికి వెన్నెముక తల్లి. ఈ రంగం ఆవిష్కరణ అభివృద్ధికి అవకాశాలతో పరిపక్వం చెందింది, తయారీ మొత్తం వృద్ధికి దోహదపడుతుంది అన్నారు. HIMTEX అనేది అత్యాధునిక సాంకేతిక ఆవిష్కరణలను ప్రదర్శిస్తూనే మెషిన్ టూల్స్, ఇంజనీరింగ్, రోబోటిక్స్, ఆటోమేషన్‌లలో ఉపయోగించని అవకాశాలను అన్వేషించడానికి ఒక అసాధారణమైన వేదిక అని తెలిపారు. ఈ ఎక్స్‌పోస్‌లకు తెలంగాణ ప్రభుత్వం, SME ఛాంబర్ ఆఫ్ ఇండియా, ఆల్ ఇండియా అసోసియేషన్ ఆఫ్ ఇండస్ట్రీస్, ప్రాసెస్ ప్లాంట్ & మెషినరీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, లూథియానా మెషిన్ టూల్, నేషనల్ సాలిడ్ వేస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా వంటి అనేక పరిశ్రమల సంస్థలు మద్దతు ఇస్తున్నాయని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా షో డైరెక్టరీని విడుదల చేశారు.

# మూవీభేరి

## రామ్ చరణ్ చిరుత హీరోయిన్ గుర్తుందా?

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటించిన మొదటి చిత్రం చిరుత. 2007లో విడుదలైన ఈ సినిమా సూపర్ హిట్ గా నిలిచింది. ముఖ్యంగా చిరంజీవి వారసత్వంతో ఇండస్ట్రీలో అడుగు పెట్టిన చరణ్ కు చిరుత సినిమా మంచి పునాదిగా నిలిచింది. ఇందులో చరణ్ డ్యాన్స్, ఫైట్స్ మెగాభిమానులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. డ్యాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ తెరకెక్కించిన ఈ యాక్షన్ ఎంటర్ టైనర్ లో నేహా శర్మ హీరోయిన్ గా నటించింది. పొగరు బోతు అమ్మాయి పాత్రలో మంచి అభినయం ప్రదర్శించింది. రామ్ చరణ్ తో పాటు నేహా శర్మకు కూడా ఇదే మొదటి సినిమా కావడం గమనార్హం. ఈ సినిమా తర్వాత వరుణ్ సందేశ్ హీరోగా నటించిన కుర్రాడు సినిమాలో కనిపించింది. ఈ సినిమా కూడా హిట్ గా నిలిచింది. అయితే దీని తర్వాత పెద్దగా తెలుగు సిని మాల్లో కనిపించలేదు నేహా శర్మ. తేరీ మేరీ కహానీ' సినిమాతో హిందీలో అడుగు పెట్టింది. ఆ తర్వాత పలు హిందీ చిత్రాల్లోనూ బోల్డ్ పాత్రల్లో అదరగొట్టింది. క్యా సూపర్ కూల్ హై హై హమ్, యమ్లా పాగలా దీవానా 2, యంగిస్తాన్, తుమ్ బిన్, ముబారకన్, సోలో, తానాజి, వికల్ప్ తదితర హిందీ సినిమాల్లో నటించింది. కాగా నాని, మృణాళ్ ఠాకూర్ నటించిన హాయ్ నాన్న సినిమాలో ఓ క్యామియో రోల్ పోషించింది నేహా శర్మ. అలాగే ఈ ఏడాది విడుదలైన బాలీవుడ్ హిట్ మూవీ విక్కీ కౌశల్ బ్యాడ్ న్యూస్ లోనూ ఓ స్పెషల్ రోల్ లో మెరిసింది. అలాగే 36 డేస్ అనే వెబ్ సిరీస్ లోనూ మెరిసింది. గతంలో కంటే బాగా సినిమాలు తగ్గించేసిన నేహా వర్మ సోషల్ మీడియాలో మాత్రం ఫుల్ యాక్టివ్ గా ఉంటోంది. ఆ మధ్యన ఐస్ బాత్ ఛాలెంజ్ అంటూ నేహా షేర్ చేసిన వీడియో సోషల్ మీడియాలో తెగ వైరల్ గా మారింది. అలలాగే ఈ ఏడాది లోక్ సభ ఎన్నికల ప్రచారంలోనూ మెరిసిందీ అందాల తార. తన తండ్రి అజిత్ శర్మ లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయడంతో ఆయన తరపున ఎన్నికల రోడ్‌షోలో పాల్గొని ప్రచారం చేసింది. తాజాగా తన సోదరి పుట్టిన రోజు సందర్భంగా నేహా శర్మ కొన్ని ఫొటోలు సోషల్ మీడియాలో షేర్ చేసింది. ఇందులో అక్కా చెల్లెలిద్దరూ ఎంతో అందంగా కనిపించారు. అయితే నేహా మాత్రం చాలా బొద్దుగా తయారయ్యింది.





## నటిగా నిలిచాను.. నిర్మాతగా గెలుస్తాను!

అక్కకోసం ప్రయత్నిస్తే అవకాశం చెల్లిని వరించింది. వచ్చిన అవకాశాన్ని అంది పుచ్చుకుని తొమ్మిదో తరగతిలోనే నట ప్రయాణం ప్రారంభించింది. అది మొదలు రెండు దశాబ్దాలుగా వరుస సినిమాలు, సీరియల్స్‌లో నటిస్తూ ప్రేక్షకులను అలరిస్తున్న నటి శ్వేతా షైన్. 'చక్రవాకం', 'సిరిమల్లె పువ్వు' లాంటి సీరియల్స్‌తో మంచి పేరు తెచ్చుకున్న శ్వేత.. యమదొంగ లాంటి సూపర్ హిట్ సినిమాలోనూ నటించి మెప్పించింది. జీ తెలుగు 'పడమటి సంధ్యారాగం'లో నటిగా ప్రేక్షకులను అలరిస్తూనే 'మేఘసందేశం' సీరియల్‌కు ప్రొడ్యూసర్‌గానూ వ్యవహరిస్తున్నది. నటిగా రాణించిన చోటే నిర్మాతగా నిలదొక్కుకునే ప్రయత్నంలో ఉన్న శ్వేత.



## వీరమల్లు పోరాటాలు

పవన్‌కల్యాణ్ 'హరిహరవీరమల్లు'కు చెందిన కీలకమైన అప్‌డేట్ వచ్చేసింది. ఈ నెల 14 నుంచి ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్‌ను ప్రారంభించినట్టు మేకర్స్ ప్రకటించారు. ఈ షెడ్యూల్‌లో స్టంట్ కొరియోగ్రఫర్ సిల్వ నేతృత్వంలో భారీ యుద్ధ సన్నివేశాలను చిత్రీకరించనున్నట్టు వారు తెలిపారు. ఈ చిత్రీకరణలో దాదాపు 500మంది ఫైటర్లు, జూనియర్ ఆర్టిస్టులు పాల్గొంటున్నారని, మరికొద్దిరోజుల్లో పవన్‌కల్యాణ్ కూడా షూటింగ్‌లో పాల్గొంటారని దర్శకుడు జ్యోతికృష్ణ చెప్పారు. మునెపెన్నడూ చూడని విధంగా ఓ అద్భుతమైన యోధుడిగా పవన్‌కల్యాణ్ ఇందులో కనిపిస్తారని, ఆయన కెరీర్‌లోనే తొలి ఫిక్షనల్ మూవీ ఇదని, అన్ని కార్యక్రమాలనూ త్వరితగతిన పూర్తి చేసి త్వరలోనే 'హరిహరవీరమల్లు పార్ట్ 1'ను విడుదల చేస్తామని జ్యోతికృష్ణ తెలిపారు. బాబీడియోల్, అనుపమ్‌ఖేర్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: మనోజ్ పరమహంస, సంగీతం: ఎం.ఎం.కీరవాణి, నిర్మాత: ఎ.దయాకర్‌రావు, సమర్పణ: ఏ.ఎం. రత్నం, నిర్మాణం: మెగా సూర్య ప్రొడక్షన్స్.

## ఆ.. సినిమా హిట్‌తో అటు ఎన్టీఆర్.. ఇటు బన్నీ హ్యాపీ!

సినీ పరిశ్రమలో పోటీతత్వం ఎలా వున్నా.. ఒకరి సినిమాలు విజయం సాధిస్తే.. మరొకరు అభినందనలు తెలపడం సహజమే. అయితే తాము నటించని సినిమాలు విజయం సాధించినా వాళ్లకంటే ఎక్కువగా హ్యాపీగా ఫీలయ్యే సినిమాలు, ఆ సందర్భాలు చాలా అరుదుగా వస్తుంటాయి.. అలాంటి ఓ సందర్భమే ఇప్పుడు కథానాయకుడు ఎన్టీఆర్, మరో కథానాయకుడు అల్లు అర్జున్‌ది. ఆగస్టు 15న మూడు పెద్ద సినిమాల పోటీలో బరిలో నిలిచిన చిత్రం 'ఆయ్'. దాదాపు అందరూ కొత్తవాళ్లు, ఒకటి రెండు సినిమాల అనుభవం వున్న ఆర్టిస్టుల సినిమాలతో రూపొందించిన చిత్రమిది. పెద్ద సినిమాల బరిలో నిలిచిన ఈ చిత్రం ఫైనల్‌గా ఆగస్టు 15న విడుదలైన చిత్రాల్లో విజేతగా నిలిచింది. పూర్తి వినోదాత్మకంగా రూపొందిన ఈ చిత్రానికి అటు ప్రేక్షకుల నుంచి, ఇటు విమర్శకుల నుంచి మంచి స్పందనే కనిపిస్తుంది. అయితే ఈ చిత్రంలో హీరోగా నటించిన నార్నే నితిన్, స్టార్‌హీరో ఎన్టీఆర్ భార్య ప్రణతికి తమ్ముడు... అంటే ఎన్టీఆర్‌కు బావమరిది. ఇక ఈ సినిమాను నిర్మించింది. అల్లు అర్జున్ అత్యంత సన్నిహితుడు, స్నేహితుడు బన్నీవాస్.. ఈ చిత్రం కోసం ఎన్టీఆర్, ఇటు అల్లు అర్జున్ ప్రత్యక్షంగా ఎటువంటి కార్యక్రమాల్లో పాల్గొనకపోయినా వాళ్ల సపోర్ట్ ఈ సినిమాకు వుంది.

ఈ చిత్రం ప్రీరిలీజ్ ఫంక్షన్‌లో ఎన్టీఆర్, బన్నీ ఇద్దరూ పాల్గొనాల్సి వుంది. అయితే ఎన్టీఆర్ దేవర షూటింగ్‌లో, అల్లు అర్జున్ పుష్ప 2 చిత్రంలో బిజీగా వుండటం వల్ల కుదరలేదు. అయితే ఈ ఇద్దరు స్టార్ హీరోలు తమ సోషల్ మీడియా ద్వారా ఈ చిత్రాన్ని సపోర్ట్ చేసి పరోక్షంగా ఈ చిత్రం ఓపెనింగ్స్‌కు కారణమయ్యారు. అయితే ఇప్పుడు ఆయ్ చిత్రం విజయం సాధించడంతో... ఇద్దరూ హ్యాపీగా వున్నారు.. సో..ఒక సినిమా సక్సెస్ ఇద్దరూ స్టార్ హీరోలను హ్యాపీ చేసిందని అంటున్నాయి సినీ వర్గాలు.



Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com